# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 17-12-2025 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- రాష్ట్రపతి ద్రౌపది ముర్మ్ శీతాకాల విడిది కోసం ఈ సాయంత్రం సికింద్రాబాద్ చేరుకున్నారు.
- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఒమన్ దేశంలో పర్యటిస్తున్నారు.
- పార్లమెంట్ సమావేశాల్లో ఈరోజు పలు కీలక బిల్లులకు ఆమోదం లభించింది.
- భారత్, దక్షిణాఫ్రికా జట్ల మధ్య ప్రారంభం కావాల్సిన టీ-20 క్రికెట్ మ్యాచ్ పొగ మంచు కారణంగా ఆలస్యమయింది.

==============================

రాష్ట్రపతి ద్రౌపది ముర్మ్ వార్షిక దక్షిణ భారత పర్యటనలో భాగంగా సికింద్రాబాద్ లోని బొలారంలో ఉన్న రాష్ట్రపతి నిలయానికి చేరుకున్నారు. రాష్ట్రపతికి తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ విమానాశ్రయంలో స్వాగతం పలికారు. ఈ నెల 22వ తేదీ వరకు రాష్ట్రపతి కార్యకలాపాలను ఇక్కడి నుండే నిర్వహించనున్నారు. ఈ నెల 19న రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ల ఛైర్పర్సన్ల జాతీయ సదస్సును రాష్ట్రపతి ప్రారంభిస్తారు. ఈ నెల 20వ తేదీన గచ్చిబౌలిలో బ్రహ్మకుమారీలు నిర్వహించే `భారతదేశం శాశ్వత జ్ఞానం - శాంతి ప్రగతికి మార్గాలు` అనే సదస్సులో పాల్గొంటారు. ప్రతీ ఏటా శీతాకాల విడిది కోసం రాష్ట్రపతి హైదరబాద్ రావడం ఆనవాయితీగా వస్తోంది.

==============================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విదేశీ పర్యటనలో భాగంగా కొద్ది సేపటి క్రితం ఒమన్ చేరుకున్నారు. ఒమన్ రాజధాని మస్కట్ విమానాశ్రయంలో ప్రధానమంత్రికి ఘన స్వాగతం లభించింది. ఈ పర్యటనలో ముందుగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఒమన్ ఉప ప్రధానమంత్రి సయ్యద్ షిహాబ్ బిన్ తారిక్ అల్ సైద్ తో సమావేశమై ఇరు దేశాల రక్షణ సహకారంపై చర్చించారు. భారత్, ఒమన్ దేశాల మధ్య దౌత్య సంబంధాలు నెలకొని 70 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా రెండు రోజుల పాటు ఒమన్ లో నరేంద్ర మోదీ పర్యటిస్తున్నారు. పరస్పర అభివృద్ధి కోసం కలిసి పని చేయడానికి ఇరు దేశాల సంబంధాలను మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా ఈ పర్యటన సాగనుంది. అంతకుముందు ఇథియోపియాలో పర్యటించిన భారత ప్రధాని ఆ దేశ పార్లమెంట్ నుద్దేశించి

ప్రసంగించారు. భారత్ - ఇథియోపియా దేశాలు ప్రాంతీయ భద్రతలో సహజ భాగస్వాములని పేర్కొన్నారు. దాదాపు 2 వేల సంవత్సరాల క్రితం ఇరు దేశాల పూర్వీకులు రెండు దేశాల మధ్య సంబంధాలను ఏర్పరచుకున్నారని నరేంద్ర మోదీ పేర్కొంటూ...

(వాయిస్ 36 సెకన్లు)

ఈ పర్యటన సందర్భంగా ఇథియోపియా అత్యున్నత పురస్కారమైన `ది గ్రేట్ హానర్ నిషాన్ ఆఫ్ ఇథియోపియా` తో భారత ప్రధాని నరేంద్రమోదీని ఆ దేశ ప్రధానమంత్రి డాక్టర్ అబీ అహ్మద్ అలీ సత్కరించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

పార్లమెంట్ సమావేశాల్లో భాగంగా ఈ రోజు పలు కీలక బిల్లులకు ఆమోదం లభించింది. రిపీలింగ్ అండ్ అమెండింగ్ బిల్-2025కు పార్లమెంటు ఆమోదం తెలిపింది. రాజ్యసభలో బిల్లుపై ఈరోజు చర్చ అనంతరం ఆమోదం లభించింది. ఇక లోక్ సభ ఈ బిల్లుకు నిన్న ఆమోదం తెలిపింది. పాతబడిన, అవసరం లేని చట్టాలను తొలగించడంతో పాటూ మరికొన్ని ఇతర చట్టాలను సవరించడానికి ఈ బిల్లు వీలు కల్పిస్తుంది. అదే విధంగా సబ్ కా బీమా.. సబ్‌కీ రక్ష.. (బీమా చట్టాల సవరణ) బిల్లు-2025కు రాజ్యసభ ఈరోజు చర్చ అనంతరం ఆమోదం తెలిపింది. ఈ బిల్లు భారతీయ బీమా కంపెనీలలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల పరిమితిని చెల్లించిన ఈక్విటీ మూలధనంలో 74 శాతం నుండి 100 శాతానికి పెంచాలని ప్రతిపాదించింది. అనంతరం రాజ్యసభను రేపటికి నిరవధిక వాయిదా వేయగా లోక్ సభ మాత్రం పలు అంశాలపై ఈ రోజు రాత్రి 10 గంటల వరకూ చర్చించనుంది. అందులో భాగంగా `వికసిత్ భారత్ రోజ్‌గార్ ఆజీవిక హామీ మిషన్ గ్రామీణ్` (విబి జీ రామ్ జీ బిల్లు)ను కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖా మంత్రి శివరాజ్ సింగ్ లోక్ సభలో చర్చకు తీసుకువచ్చారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రధాన మంత్రి కౌశల్ వికాస్ యోజన (PMKVY) కింద గత ఐదేళ్లలో 53 లక్షల మందికి పైగా అభ్యర్థులకు శిక్షణ ఇచ్చినట్లు కేంద్ర నైపుణ్యాభివృద్ధి వ్యవస్థాపక మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి జయంత్ చౌదరి తెలిపారు. రాజ్యసభలో ఒక ప్రశ్నకు ఆయన ఈరోజు లిఖితపూర్వక సమాధానమిస్తూ... ఈ విషయాన్ని తెలియజేశారు. PMKVY4.O కింద ఉపాధిని, పరిశ్రమ భాగస్వామ్యాలను మెరుగుపరచడానికి ప్రభుత్వం పలు చర్యలు తీసుకుంటోందన్నారు. సుమారు 70.5 శాతం మంది తమకు నచ్చిన నైపుణ్య రంగాలలో ఉపాధి పొందారని వెల్లడించారు. పరిశ్రమలు, పారిశ్రామిక సంఘాలు, శిక్షణా సంస్థల నుండి స్వీకరించిన ప్రతిపాదనల ఆధారంగా శిక్షణా కేంద్రాలను రాష్ట్ర ప్రభుత్వాలు ఏర్పాటు చేస్తారని మంత్రి జయంత్ చౌదరి పేర్కొన్నారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

సుస్థిర భారతదేశ పరివర్తన కోసం అణుశక్తి వినియోగం, అభివృద్ధి బిల్లు-2025 కు లోక్ సభ ఈరోజు ఆమోదం తెలిపింది. అటామిక్ ఎనర్జీ రెగ్యులేటరీ బోర్డు ఏర్పాటుతో పాటూ అటామిక్ ఎనర్జీ పరిహార సలహా మండలిని స్థాపించడానికి ఈ బిల్లు ఉద్దేశించబడింది. ఈ బిల్లుపై జరిగిన చర్చ సందర్భంగా కేంద్ర శాస్త్ర సాంకేతిక శాఖ సహాయ మంత్రి జితేంద్ర సింగ్ మాట్లాడుతూ... దేశ అభివృద్ధి ప్రయాణానికి ఈ బిల్లు ఒక కొత్త దిశానిర్దేశం చేస్తుందన్నారు. అణు ప్రమాదం సంభవించినప్పుడు కేంద్ర ప్రభుత్వ బాధ్యత గురించి కూడా ఈ బిల్లు నిర్దేశిస్తుందని తెలిపారు. వ్యక్తిగత ఆవిష్కరణలు, పరిశోధనలు చేపట్టడానికి బిల్లులోని 9వ సెక్షన్ అనుమతిస్తుందని చెప్పారు. మరో సెక్షన్ భద్రతా కారణాల దృష్ట్యా కొన్ని కంపెనీల ప్రమేయాన్ని పరిమితం చేయడానికి ప్రభుత్వానికి అధికారం కల్పిస్తుందని జితేంద్ర సింగ్ వివరిస్తూ...

(వాయిస్ 31 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

గత దశాబ్దంలో దేశం ప్రతి రంగంలోనూ చెప్పుకోదగిన అభివృద్ధిని సాధించిందని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. న్యూఢిల్లీలో ఈరోజు జరిగిన భారత ఆర్థిక సదస్సులో ఆమె ప్రసంగిస్తూ.. దేశ ఆర్థిక వ్యవస్థ బలపడిందని, శ్రామిక శక్తిలో మహిళల భాగస్వామ్యం కుటుంబాలకు ఆర్థిక వెసులుబాటు కల్పించిందని పేర్కొన్నారు. సాధారణ పౌరులకు భారం కాని రీతిలో ప్రభుత్వం కనీస బీమాను కల్పించిందని నిర్మలా సీతారామన్ మాట్లాడుతూ....

(వాయిస్ 27 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రైలు ప్రయాణాలకు సంబంధించి రిజర్వేషన్ చార్ట్ సన్నద్ధతపై రైల్వే శాఖ కీలక నిర్ణయంతీసుకుంది. ప్రస్తుతం రైలు బయల్దేరడానికి 4 గంటల ముందు తయారు చేసే రిజర్వేషన్ చార్టును ఇకపై దాదాపు 10 గంటల ముందుగానే ఖరారు చేయాలని నిర్ణయించింది. దీనికి సంబంధించి చార్ట్ ప్రిపరేషన్ షెడ్యూల్ పై రైల్వే బోర్డు అన్ని జోనల్ కార్యాలయాలకు ఆదేశాలు జారీ చేసింది. దాదాపు 10 గంటల ముందే టికెట్ స్టేటస్‌ను తెలుసుకోవడం ద్వారా ప్రత్యామ్నాయ ప్రయాణ ఏర్పాట్లు చేసుకోవడానికి ప్రయాణీకులకు వీలుకలుగుతుందని పేర్కొంది. కొత్త టైమింగ్స్ ప్రకారం.. ఉదయం 5 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు బయల్దేరే రైళ్లకు తొలి చార్టును ముందు రోజు రాత్రి 8 గంటల సమయానికి రూపొందించాల్సి ఉంటుంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారత్ దక్షిణాఫ్రికాజట్ల మధ్య ప్రారంభం కావాల్సిన టీ-20 క్రికెట్ మ్యాచ్ పొగ మంచు కారణంగా ఆలస్యమయింది. లక్నోలోని బిఆర్ఎస్ఏబీవీ ఏక్నా స్టేడియం వేదికగా ఈ మ్యాచ్ జరుగుతోంది. ఐదు మ్యాచ్ ల టీ-20 సిరీస్ లో 2-1 తేడాతో ముందంజలో ఉన్న భారత్ ఈ మ్యాచ్ లో విజయం సాధించి సిరీస్ ను కైవసం చేసుకునేందుకు సిద్ధమవుతోంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈరోజు నష్టాల్లో ముగిశాయి. సెన్సెక్స్ ఉదయం 84 వేల 679 పాయింట్ల వద్ద లాభాల్లో ప్రారంభమై... చివరకి 120 పాయింట్ల నష్టంతో 84 వేల 559 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 41 పాయింట్లు నష్ట పోయి 25 వేల 818 వద్ద స్థిరపడింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ 90 రూపాయల 37 పైసలుగా ఉంది. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 60.34 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 4 వేల 320 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =